# మిన్నేరు

అంతు చిక్కకుండా సాగిపోయే జీవనయానంలా రోడ్డు. దాని పక్కనే, ఒంటరిగా అఘోరించే మానవ అస్తిత్వంలా మూడంకణాల ఓ ఒంటరి దద్దలం.

ఆరు నిలువుకూసాల మీద రాతిదూలాలు. వాటిమీద మట్టసంగా కుదిర్చిన వెడల్పాటి రాతిబండలు. పైన, వర్షాకాలంలో నీళ్ళు దిగకుండా వేసి వున్న సుద్దమట్టి, వెనుక నుంచీ రాతికూసాలను కలుపుతూ మూడు వైపులకు కట్టివున్న మట్టిగోడ. రోడ్డువైపున నడుములెత్తు గోడమాత్రమే వుండి. మధ్యలో లోపలికి ఏర్పాటు చేయబడి వున్నదారి. కింద గచ్చుతో కూడిన మట్టి తప్ప మరేమీ లేదు. ఏకాలంలో కట్టిందో గానీ గోడ అక్కడక్కడా పెచ్చులూడిపోయి వృద్ధాప్యంతో ఊగిసలాడుతున్న మానవశరీరంలా శిధిలావస్థలో వుంది.

ఆ దద్దలం వెనకనే జీవుల తాపాన్ని తీర్చే జలంతో నిండిన ఓ చిన్న నీటికుంట, పగలు పల్లెపల్లె తిరిగి, అలసిపోయి వచ్చిన అభాగ్యుల్ని ఆప్యాయంగా అక్కున చేర్చుకునే ఆపద్బాంధవిలా అందర్నీ చేరదీస్తున్న ఆదద్దలంలో, రాత్రంతా విశ్రాంతి తీసుకున్న మొండోడు, బైరాగి జోలెల్ని సంకలకు తగిలించుకుని ఊరివైపు నడిచారు.

మొకాళ్ళదాకా వదలి బిగుతుగా బిగించిన గోచీ, అది జారిపోకుండా మొలకు ఒక వెడల్పాటి బెల్టు, మెడలో వెంట్రుకలతో పేనిన నల్లటి దారం, కుడిచేతి మణికట్టువరకు తొడుక్కున్న ఇనుప కడియాలు, చేతిలో సగం విరిగిపోయిన మచ్చుకత్తిముక్క, సంకలో జోలె, నెత్తికి ఒక పాత తువ్వాలు, యాభైకి పైబడిన వయసు ... యిదీ మొండోడి ఆకారం.

వంటికి కాషాయం రంగు వస్త్రాలు, మెడలో పూసలదండలు, రుద్రాక్షమాలలు, ముఖాన విబూది రేఖలు, జానెడు పొడవున్న బవిరిగడ్డం, చేతిలో ఏకునాదంతో, ఆరు పదులు దాటిన వయసుతో భవబంధాలను వదిలేసిన అపరసన్యాసిలా వున్నాడు బైరాగి. కళ్ళలో మహామౌనిలా నిర్మలమైన భావన, మమతా విరహితమైన చూపు, గంభీరమైన మాటతీరు ... ఆ స్థితిని బైరాగి ఎలా సాధించాడు?

ఎప్పుడూ ఏవో ఆలోచనలు, మనసులో ఒకటే బాధ. ఏదో ఆర్తి! గుండెలో ఏదో ముల్లు ఉండుండి గుచ్చుకుంటోంది. మొండోడి మెదడుకీ ఆలోచనలకీ వున్న లంకె ఎంతకీ తెగిపోవడం లేదు.

ఎప్పుడో యాభైఏళ్ళ క్రితం మొండోడు ఆ ఊరి యానాది మిట్టలో ఊపిరి పోసుకున్నాడు. దరిద్ర దేవతకు పట్టాభిషేకం చేసుకున్న కుటుంబం. అగ్రికులు అంచుకు చేరనియ్యని కులం. ఇంకా చెప్పాలంటే అంటరానోళ్ళు సైతం ఆదరించలేని కులం.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఎవరైనా చనిపోతే మొండోడి తండ్రికి కబురొచ్చేది. అతని చేత

శవాన్ని కోయించి పంచనామా నిర్వహించేవాళ్ళు చుట్టుపక్కల ఊళ్ళల్లో గర్భిణీస్త్రీ చనిపోయినా తండ్రికి కబురందేది. అక్కడా శవాన్ని కోసి వాళ్లిచ్చేదేదో తీసుకువచ్చేవాడు. కొందరు శవంనోట్లో అంత బంగారం ముక్క నుంచి పూడ్చేస్తుంటారు. వాళ్ళు అలా శవాన్ని పూడ్చి, వదలి రాగానే మొండోడి తండ్రి ఆరాత్రే వెళ్ళి ఆ గుంతతవ్వి, శవంనోట్లో పెట్టిన బంగారాన్ని తీసుకు వచ్చేవాడు. ఆతనిది శవాలతోనే జీవితం అదిలేనప్పుడు పల్లెలంట భిక్షాటనం చేసేవాడు. ఏదో తెచ్చేవాడు. సంసారం సాగించేవాడు. మొండోడికి ఇహలోక ఊహ తెలిసీ తెలియని వయసులోనే తల్లి మరణించింది. అంత వయసులో మాతృవియోగం భరించలేక పోయాడు మొండోడు. లోకంలో తను ఏకాకిగా మిగిలిపోయినట్టు తనకు ఎవ్వరూ లేనట్టు బాధ. ఆనాడే ప్రారంభమైంది. అమ్మలేని జీవితం దుర్భరమనిపించింది. ఆ బాధ గుండెలో ముల్లులా తయారయింది. ఒక రోజు తండ్రిని చావంటే ఏమిటి అని అడిగాడు.

"ఈ లోకాన్ని వదిలి పెట్టిపోవడం" అన్నాడు తండ్రి.

"అయితే అమ్మ ఈ లోకాన్ని వదిలిపెట్టి ఎక్కడికి పోయి వుంటుంది?" అడిగాడు.

"దేవుడి దగ్గరికి" అన్నాడు తండ్రి.

"చచ్చి పోయిన వాళ్ళంతా దేవుడి దగ్గరి కెళతారా?"

"లేదు. పుణ్యం చేసుకున్నవాళ్ళు దేవుడి దగ్గరకు వెళతారు. అంటే స్వర్గానికి. పాపం చేసుకున్నోళ్ళు నరకానికి వెళతారు. లేదా దయ్యాలై తిరుగుతారు." అన్నాడు తండ్రి.

స్వర్గం నరకం ... అవి ఎక్కడుంటాయి? దేవుడు దెయ్యం, పాపం పుణ్యం.. అవి ఎలా వుంటాయి?

గుండెలో ముల్లు అవిరామంగా గ్రుచ్చసాగింది.

మొండోడికి పదేళ్ళు వచ్చాయి. తండ్రి ముసలాడయ్యాడు. బతుకు గడవడం లేదు. కొద్ది రోజులు తండ్రి వృత్తినే స్వీకరించాడు. పల్లెపల్లె తిరిగాడు. ఇల్లు ఇల్లు తిరిగాడు. అప్పుడప్పుడూ శవాల్ని కోసేపని తగిల్తే తండ్రితో బాటు వెళ్లాడు. అయినా భుక్తి గడవడం గగనమై పోయింది. జానెడు పొట్టకు ఎన్ని తిప్పలో అనుకునేవాడు. ఇలా కాదని యానాది మిట్టకు ఆనుకుని వున్న ఊర్లో ఓ రైతు యింట్లో పశువులు కాయడానికి జీతానికి కుదిరాడు. ఇలాంటి పరిస్థితిలోనే ఒక రోజు తండ్రి అతిగా తాగేసి గతించాడు. దాంతో ఒంటివాడై పోయాడు మొండోడు. అప్పుడూ అదేబాధ. అప్పుడప్పుడూ వేధిస్తున్న వ్యథ.

ఎలాగో కాలం గడుస్తూ వుంది. యవ్వనంలో కొచ్చాడు మొండోడు. తన కాలనీలోనే ఒక అమ్మాయిని చూసి ఇరవై రూపాయలు ఓలిచ్చి మరీ పెండ్లి చేసుకున్నాడు. భార్యతో సంసారం అయిదేండ్లు బాగానే సాగింది. ఒక ఆడబిడ్డకూడా పుట్టింది. ఇంతలో కాలం మారింది. వ్యవసాయం దెబ్బతింది. వానలు సక్రమంగా పడడం మానేశాయి. అడిగితే అంత పెట్టే రైతులకు మిగిలిన యాచక జీవులకు మధ్య దూరం క్రమంగా పెరగసాగింది. మనుషులకు తిండిలేదు.

పశువులకు మేతలేదు. ఊర్లో పశువులు కబేళాలకు తరలిపోతున్నాయి. మనుషులకు పశువులకు మధ్యనున్న అనుబంధమేదో పుటుక్కున తెగిపోసాగింది. కరుణామయుడైన రైతు కర్కశంగా మారిపోయి కసాయివాళ్ళకు పశువుల్ని అమ్మేస్తుంటే. వాళ్ళ కళ్ళెదుటే వాటికాళ్ళను నరికి లారీలకు ఎక్కిస్తున్నారు. దూర ప్రదేశాలకు తరలిస్తున్నారు. మొండోడు జీతానికి నిలిచిన రైతూ పశువుల్ని ధారపోసేశాడు. ఆయింటికి మొండోడు అవసరం తీరిపోయింది. తిరిగి భిక్షాటనం తప్పలేదు. అన్నం కరువైన ఆకాలనీని ఉన్నట్టుండి అతిసార అవహించింది. ఒక ఊపు ఊపేసింది. ఎన్నో ప్రాణాలు, వేసవిలో ఆకులు రాలినట్లు రాలిపోయాయి. అతని భార్యాబిడ్డలు దానికి బలికాక తప్పలేదు. రాలిపోక నిలువలేదు. తట్టుకోలేక పోయాడు మొండోడు. మానసికంగా దెబ్బ తిన్నాడు.

"ఎందుకిలా జరిగింది? నా వాళ్ళు ఇంక తిరిగి రారా?" మళ్ళీ ఆదేతపన, ఆర్తి, ఆవేదన, గుండెలోముల్లు గుండెగోడల్ని పెకలించసాగింది. మనశ్శాంతి కొరవడింది. ఉన్న పూరిగుడిసెను వదిలేశాడు. ఊరు వదిలేశాడు. ఎక్కడెక్కడో తిరిగాడు కానీ అతనాసించింది అతనికి దొరకనేలేదు. బతుకు అర్థం తెలియనేలేదు. ఒకటే మనోవ్యథ. వేరే మార్గమే అగమ్య గోచరంగా తోచింది.

అలా తిరుగుతుంటే ఎట్లాగో కొద్ది రోజులక్రితమే బైరాగి పరిచయమయ్యాడు. లోకంలోని శోకమంతా తనదేనని, అన్ని బాధలు తన కొక్కడికే వచ్చాయనీ, తనలాంటి దురదృష్టవంతుడు మరొక్కడుండడనీ నిర్వేదంలో జీవిస్తున్న మొండోడికి బైరాగి స్నేహం ఒక వరంగా తోచింది. ఎడారిలో వయాసిస్సులా అనిపించింది.

తనకంటే దురదృష్టవంతులు, అభాగ్యులు యింకా ఎంతోమంది ఉన్నారన్న సంగతి. అతని వల్లనే తెలియసాగింది మొండోడికి. బైరాగి మాటలు అతనికి కాస్తా మనశ్శాంతిని కలిగించేవి.

బైరాగిని చూస్తే మొండోడికి ఓ భక్తి భావన. గురుభావం. గౌరవం. తనకంటే అతనికి ఈ జీవితం గురించి చాలా తెలుసునన్న భావన. ఆతన్నించీ ఏవేవో తెలుసుకోవాలన్న ఆరాటం. ఆతని గురించీ తెలుసుకోవాలన్న కుతూహలం. ఎన్నోసార్లు నీ గురించి చెప్పు భైరాగన్నా అని అడిగేవాడు. కానీ బైరాగి తన గురించి ఎప్పుడూ చెప్పుకోలేదు. తన గతం గుర్తులేనట్టే ప్రవర్తించేవాడు.

"ఏందయ్యా ఆలోచిస్తున్నావు? ఊరిముందరకొచ్చేశాం" అన్నాడు బైరాగి. ఆ మాటతో ఇహంలో కొచ్చి పడ్డాడు మొండోడు.

"ఏం లేదన్నా! నీ గురించే" అన్నాడు మొండోడు.

ఆ మాటతో ఆలోచనల్లో పడ్డాడు బైరాగి.

తన పేరేమిటో, ఊరేమిటో ఎప్పుడో మరచిపోయాడు బైరాగి. తననుకన్న వాళ్ళు, తాను కన్నవాళ్ళు, తనను ప్రేమించిన వాళ్ళు తనకళ్ళ ముందరే కన్నుమూస్తే తట్టుకోలేకపోయాడు. జీవితంలో ఎదురైన ఎన్నో సంఘటనలు, అవమానాలు, బాధలు చూసి జీవితంపైన విరక్తి పుట్టింది.

బతకాలన్న ఆశ చచ్చిపోయింది. ఒక్కోసారి బతుకును అంతంచేసుకోవాలని కూడా అనుకున్నాడు. కానీ ధైర్యం చేయలేకపోయాడు. ఇల్లు వదిలేశాడు. ఎక్కడెక్కడో తిరిగాడు. తనకు తెలిసిన తత్త్వాలు పాడుకుంటూ భిక్షాటనంచేస్తూ ఎన్నో గుడులు తిరిగాడు. గోపురాలు చూశాడు. ఎక్కడో తినడం ఎక్కడో పడుకోవడం. ఒక తిండికాదు. ఒక ఊరుకాదు. దేశమంతా అతనిదే అయింది ... ఆ నిరంతర ప్రయాణంలో ఈ మధ్యనే ఆ ఊరికొచ్చాడు. మొండొడితో పరిచయమయ్యాడు.

"య్యోవ్! బైరాగన్నా ... ఏమి? నీ గురించడిగితే యోచన్లో పడిపోతివే ... నీవేందో నీకతేందో చెప్పయ్యా" అన్నాడు మొండోడు.

"నాగురించా? నా గురించి తెలుసుకునేదేముందిలేబ్బా" అంటూ ఒక చిరునవ్వు నవ్వి మాటదాటవేసేశాడు బైరాగి.

ఇద్దరూ ఊర్లో అడుగుపెట్టారు.

అప్పటికే ఎండ పరిసరాల్ని కాల్చుకుతినడం ప్రారంభించింది. వీధి మొగదల పెద్దరావి చెట్టు. ఆ చెట్టు చుట్టూ రచ్చబండ. దాని పక్కనే ఓ బోరింగు.

బోరింగు కొట్టి నీళ్ళు తాగివెళ్ళి, కొంతసేపు ఆ రచ్చబండ మీద కూర్చున్నారు. రవరవాని తోలుతున్న దక్షిణానిలం ఆరావి చెట్టు ఆకుల్లో దూరిపోయి వాటితో ఏవో జీవన రహస్యాల్ని మాట్లాడుకుంటున్నట్లు ఆకుల కదలికలు వినిపిస్తున్నాయి.

రాత్రి ఎప్పుడో పక్క ఊళ్లో అడుక్కుతిన్న అన్నం. కడుపులో ఒకటే ఆకలి, ఆకలి, పస్తులు వాళ్ళకు మామూలే అయినా ప్రయత్నించక తప్పదు కదా!

"యోవ్, మొండాయనా, నేనొగపక్కింటి అడక్కొస్తా నువ్వొగపక్కింటి అడక్కరా" అన్నాడు - బైరాగి.

సరేనన్నాడు మొండోడు.

ముందుగా బైరాగి పైకిలేచి ఒక్క క్షణం కళ్ళుమూసుకుని, దేవున్ని ప్రార్థించి ఆకాశంలోకి ఓ నమస్కారం చేశాడు. ఏకునాధం చేతబట్టుకున్నాడు. టింగు టింగు శబ్దం చేసుకుంటూ వీధిలో ఓ యింటి ముందర నిలబడి పాటెత్తుకున్నాడు.

"ఎగిరిపోతాంది సిలకా - హంస ఎగిరిపోతాంది సిలకా ...

కట్టిన యిల్లిడిసీ, పెట్టినా పావులిడిసీ

ఎగిరిపోతాంది సిలకా - హంస ఎగిరిపోతాంది సిలకా ... "

కమ్మటి కంఠం, దానికి ఏకునాథ శబ్దం ... అతని గొంతులో తత్త్వం పుట్టి, పెదవులతో పురుడు తీర్చుకుంటోంది. పాటగా మారి గాలిలో కలిసిపోయి లయబద్ధంగా ప్రవహిస్తోంది. దారంట పొయ్యే వాళ్ళను కూడా వొకింత సేపు ఆపి, ఆలకింప చేస్తోంది.

"కట్టండి బందిలీ - యెయ్యండి యెమినీలో సిలకా

ఇల్లూ వాకీలీ వొదిలీ - ఎగిరిపోతాంది సిలకా -

హంస ఎగిరిపోతాంది సిలకా”

అన్నం పెట్టే వాళ్ళు పెడుతున్నారు. ధాన్యం వేసేవాళ్ళు వేస్తున్నారు. లేదనే వాళ్ళు లేదంటూనే ఆతని పాట విని ఆనందిస్తున్నారు. క్రమంగా ఆతని జోలె నిండుతోంది.

‘ఏమైనా బైరాగి బైరాగే’ అనుకుంటూ ఆతని తత్త్వానికి తన్మయత్వం పొందుతూనే మరో వైపుకు బయలు దేరాడు మొండోడు.

ఒక యింటి ముందర గొంతుక్కూర్చొని, జోలె నేలపైన పెట్టి మచ్చు కత్తిని, చేతిలోని ఇనుప కడియాల కేసి కొడుతూ ‘టక్కు టక్కు’ శబ్దం చేసుకుంటూ “వానలు కురవంగ - వంకలు దొర్లంగ - గరిసెలు నిండంగ ...” అంటూ తుర్రుమని నోటితో శబ్దం చేస్తూవున్నాడు.

“మొండోన్ని తల్లే, అన్నముంటే అంతెయ్యి తల్లీ” అంటూ అరుస్తున్నాడు. బైరాగి పాట ఎంత మధురంగా వుందో మొండోడి పాటా మాటా అంత మొరటుగా వున్నాయి. మొండోడు పెట్టిన చోట పెట్టించుకుంటున్నాడు. పెట్టని చోట చేతి మణికట్టుపైన గాయం చేసుకుని, రక్తం తెప్పించి మొండి కేసుకుని మొండోడనిపించుకుంటున్నాడు. నానా ఆగీ చేస్తూ పెద్ద హఠం ప్రదర్శిస్తున్నాడు.

ఆ రోజు మధ్యాహ్నం వరకూ వాళ్ళు అలా అడుక్కొచ్చిన అన్నంతో ఆ రచ్చబండమీద కూర్చొని ఆత్మారాముడిని సంతృప్తి పరచుకున్నారు. ఆత్మారాముడు సంతృప్తి పడ్డాక, ఆ చెట్టు నీడలోనే ఆనందంగా పడుకున్నారు. అలాగే నిద్రలోకి జారుకున్నారు. కానీ వాళ్ళు తిరిగి నిద్రలేచే లోపలే ఒక పెద్దఘోరం జరిగిపోయింది.

ఆ ఊళ్ళో నిండు గర్భిణీ అయిన రాశింటి రత్నమ్మ కడుపులో తొమ్మిది నెలలుగా పెరుగుతున్న పిండం ఒక్కసారిగా కదిలింది. నొప్పులు ప్రారంభమయ్యాయి. మెలికలు తిరిగి పోసాగింది రత్నమ్మ. మంత్రసాని యల్లమ్మ ప్రయత్నించి చివరికి బిడ్డ అడ్డం తిరిగింది. ఆసుపత్రికి తోలండి అంది. ఆ ఊరికి ఆసుపత్రి మూడు మైళ్ళ దూరంలో ఉంది.

ఆయింటి మగవాళ్ళు గబగబా ఎద్దుల బండిని తీసుకొచ్చారు. నొగల మీద వరిగడ్డి పరచి ఎద్దుల్ని కట్టారు. ఇద్దరి ఆడవాళ్ళను బండిలో కూర్చోబెట్టుకుని ఆసుపత్రికి బయలుదేరారు.

“వొరే అబ్బోడా! ఎట్లా బండి కట్నారు గానీ రాళ్ళదారింటి పోనీ. ఆ కుదుపులకు కాన్పయిపోతాది. ఊర్లో తలపండిన ఒక ముసలాయన సలహాయిచ్చాడు.

“అవును అదే మంచిది” మరో ముసలమ్మ వత్తాసు పలికింది.

వాళ్ళ సూచన మేరకు రాళ్ళ దారిగుండా బండిని దడదడ లాడించారు. శరీరానికీ, ఆమె జీవానికి మధ్యవున్న సంబంధం శాశ్వతంగా తెగిపోయింది. ఆసుపత్రి చేరకనే బండి తిరిగొచ్చేసింది.

“గర్భిణీ స్త్రీని అట్లే పూడిస్తే ఊరికరిష్టం. చెప్పలేని ‘కీడు’ తగులు కుంటుంది. మొండోన్ని పిలిపించి తల్లినీ బిడ్డనీ వేరు చేయించి పూడ్చాల్సిందే. మొండోన్ని పిలవండి” అన్నారు ఛాందసులయిన ఊరి పెద్దలు.

"మన పక్కూరి మొండోడు పొద్దున్న ఊర్లోనే అడుక్కుంటావున్నాడు. సూడండ్రా" అన్నారెవరో.

దాంతో మొండోడి కోసం వెతుకులాట ప్రారంభమైంది. కొందరు వెళ్ళి చెట్టుకింద నిద్రపోతున్న మొండోన్ని నిద్రలేపారు. జరిగింది వివరించారు. నాటుసారా పడందే ఆ పనిచేయలేనన్నాడు మొండోడు. క్షణాల్లో నాటు సారా అతని నోటికందిపోయింది.

రత్నమ్మ పాడె ఊరికి దక్షిణాన శవాల్ని పూడ్చే లచ్చున్న గడ్డకు డప్పులు కొమ్ముల శబ్దాల మధ్య బయలు దేరింది.

బైరాగిని అక్కడే వుండమని చెప్పి, మూడు పాత చీరలు, ఒక గాజుపెంకు తెప్పించుకొని తూలుతూ వాళ్ళ వెంట నడవసాగాడు మొండోడు. తన జీవితంలో గర్భిణీ శవాన్ని కోయడం ఇది మూడోసారి. పదేళ్ల క్రితం మొదటిసారిగా ఈ పనిచేశాడు. ఆ తర్వాత ఏడేళ్ళ క్రితం రెండోసారి ఓ గర్భిణీ శవాన్ని కోశాడు. ఈ రోజు ఇది.

శవం గుంత దగ్గరకు చేరుకుంది. అందరూ వెళ్ళిచెట్లక్రింద కూర్చున్నారు. మొండోడు తన పని తాను ప్రారంభించాడు.

ముందుగా మొండోడు గుంతలోకి దిగాడు. అతనితో బాటు మరో వ్యక్తీ దిగాడు. గట్టు మీద, శవం పక్కనే పిండాన్నం తెచ్చిన కొత్త చట్టి, ఓనీటి కుండ, పాత చీరలు, వస్తూ వస్తూ మొండోడు తెచ్చిపెట్టిన అద్దం పెంకు తప్ప యింకేమీ లేవు.

"పీనిగిని అందివ్వండి సామీ" అన్నాడు మొండోడు.

పైనున్న వ్యక్తులు శవాన్ని మెల్లగా, పాడె పై నుంచీ ఎత్తి వాళ్ళకందించారు. మొండోడు, గుంతలో నిలబడివున్న మరో వ్యక్తి ఆ శవాన్ని అందుకుని, దక్షిణం వైపు తల, ఉత్తరం వైపు కాళ్లు వుండేవిధంగా పడుకోబెట్టారు.

ఆ గుంతలో శవం మట్టసంగా కుదురుకున్నాక "ఇంక నువ్వు పైకి పోసామీ" అని పక్కనున్న వ్యక్తిని గట్టు పైకి పంపించేశాడు మొండోడు.

అంతశోక సన్నివేశంలోను, గంపకింద వట్టి చేయి పెట్టి, దాంట్లో నుంచీ మరేదో తీయబోయే ఇంద్రజాలకుణ్ణి చూస్తున్నంత ఆసక్తిగాను, వింతగాను అటువైపే చూస్తున్నారు జనం.

"గాజు పెంకు యిట్లిచ్చి, గుంత చుట్టూ తెరపట్టండి సామే" అన్నాడు మొండోడు. దాంతో గట్టు పై నున్న అద్దం పెంకును అతనికందించి, అక్కడున్న వాళ్ళు పాత చీరల్ని తీసి గుంత చుట్టూ తెరలా పట్టి, ఆ తంతును యితరులు చూసే అవకాశం లేకుండా చేశారు.

అద్దం పెంకును చేతబట్టుకొని వున్న మొండోడు ఆ సమయంలో, నరకంలో పాపుల్ని హింసించే యమకింకరుడిలా వున్నాడు.

మొండోడు గోచీని మరోసారి సర్దుకుని, తూర్పు వైపు తిరిగి దండం పెట్టుకొని, వంగి రత్నమ్మ శవాన్ని రెండుసార్లు కళ్ళకద్దుకొని "ఇందులో నా తప్పు ఏమీ లేదు తల్లీ. నా వృత్తి నేను

చేస్తావుండా. మన్నించు మహాతల్లీ" అని గొణుక్కుని తనపనిలో తాను మునిగిపోయాడు.

శవానికి కప్పిన తెల్లగుడ్డను తొలగించి, గాజు పెంకుతో శవం కడుపును కోయసాగాడు. దాంతో బాటుగా ఆలోచనలు ఆతని మెదడును కోయసాగాయి.

"ఈయమ్మ బిడ్డను కనలేక పీనిగైపోయింది. కండ్లయినా తెరవకనే కడుపులో బిడ్డ బతుకు సాలించింది. ఈయమ్మ పొద్దన్నే దాంకా బాగానే వుండింది. ఇప్పుడు శవమైపోయింది. మనిషికి ఎప్పుడు ఏం జరుగుతుందో, సావు ఏ రూపంలో పొంచి వుంటుందో ఎవురికి తెలుసు? మొత్తానికి వంట్లో జీవుడున్నంత సేపు దానెనకనే నీడ మాదిరిగా చావూ వుంటుందనే సత్యం మరచి పోకూడదు. పుటక వెలుతురు లాంటిదయతే సావు చీకటిలాంటిది. అందుకే బైరాగి సావు పుటకలనేటివి రేయింబవుళ్ళు లాంటివంటా వుంటాడు. పుటకెంత నిజమో అంత రెండింతల నిజం సావు. చెట్లు చేమలు పుటతా వుండాయి. సస్తావుండాయి. పశువులు ప్రాణులు పుడతావుండాయి. సస్తావుండాయి. మనిషీ దానికేమి అతీతుడుకాదు. మట్టిలో పుట్టిన మడిసి తిరిగి మట్టిలో కలిసి పోయినట్లే పాణమూ గాల్లో కలిసి పోకతప్పదు. మడిసి ఇది తెలుసుకోలేక ఎన్ని పడుబాట్లు పడతాడు. వచ్చేటప్పుడు, ఏమి తెచ్చింది లేదు. పోయేటప్పుడు ఏదీ ఎత్తుకోని పోయేదీలేదు. అంతమాత్రానికి ఎందుకో ఈ గోస. ఇంతకూ ఈయమ్మ బొందిలో పాణం ఎగిరి ఎక్కడికి పోయింటింది? ఈ కడుపులోనే కన్నుమూసిన కసికందు ఏ పాపం చేసిందని నెత్తురు గుడ్డుగానే మిగిలిపోయింది? ఏందిదంతా? ఈయమ్మ సచ్చిపోయి పైలోకం యెళ్ళుంటుందేమో? అక్కడ తన పూర్వీకుల్ని కలుసుకొనుంటుందేమో?"

అన్ని రోజులూ అతని గుండెను గునపమై గుచ్చినముల్లు ఆ క్షణాన మృగంగా మారి గోళ్ళతో గుండె గోడల్ని గీరసాగింది.

చెట్లకిందవున్న జనాల హృదయాలు బరువుగా, దుఃఖాన్ని దిగమింగుతున్నాయి. అందరిలోను స్మశాన వైరాగ్యం ...

"పీనిగను రెండూ రెండుగా కోస్తా వుంటాడా?"

"అదే గదబ్బా చేస్తావుండాడు"

"మొండోడు యిప్పుడు, ఆపరేసను జేసేడాకట్రు మాదిరుండాడబ్బా"

"అంతేగదా! ఆసుపత్రిలో మడుసుల్ని కోసేపని డాక్టర్ల వృత్తి. ఈడ ఈ పని జేసేది మొండోళ్ళ వృత్తి. అంతే తేడా, ఇద్దరూ జేసేది వొగిటే"

తలోరకంగా మాట్లాడుకుంటున్నారు ...

"ఏమి జల్మమో, ఏం బిడ్డలో ఏం పాపలో. సచ్చిన మడిసిని యిట్ల కండ కండాలుగా కోయకపోతే ఏమి?"

"నిండు మనిషి గదా! అట్లే పూడ్చేస్తే యింగేమన్నా వుండాదా! లోకానికి కీడు గదా!"

"అవును. ఆ మాదిరి జేస్తే వానలు పడవు. కాటకాలతో, గాబతో, రోగాలతో జనాలు

చస్తారు. కోడీ, కుక్క, గొడ్డూ గోదా నిలువునా సస్తాయి"

"అదే గాదబ్బా. తల్లి సచ్చినా వొగోసారి బిడ్డబతికుండచ్చుగదా"

"అదిగాదు లేవయ్యా. పై లోకానికి పోవాలంటే ఈ లోకంలో ఏ బంధాలు వుండకూడదని అంటారుగదా"

"అందుకనేగదా పాడెకు కట్టినతాడుకుండే ముడులు తెగొట్టేస్తారు. కడాకు మొల్తాడు కూడా తెంపేసి, దానికుండే ముడులు విడగొడతారు. ఇదీ అంతే. తల్లికీ బిడ్డకీ వుండే అనుబంధం తెగ్గొట్టేదానికే బిడ్డెను పైకి తీస్తారు"

"అవునబ్బా. పెద్దోళ్ళు యేది జేసినా యోచ్చనలేకుండా జేయరు?"

"అందుకే యిట్ట బెట్నారు ఆశారం"

"ఏమోబ్బా! అంతా యిచ్చిత్రంగా వుండాదే"

అక్కడ పెద్ద చర్చ సాగింది. అందులో, గతంలో ఎప్పుడో గర్భిణీ స్త్రీని అలాగే పూడ్చడం వల్ల అనుభవించిన కష్టాలు కొందరుతాము అనుభవించినట్లే చెప్పుకుంటున్నారు.

ఆ మాటలన్నీ అరకొరగా మొండోడికీ వినిపిస్తూనే వున్నాయి ఇంతలో ఆ ప్రాంతమంతా వున్నట్టుండి దుర్గంధం ఒక్కసారిగా ముక్కు పుటాల్ని బ్రద్దలు చేస్తూ వ్యాపించింది.

అది శవం కడుపు నుంచీ వస్తున్న వాసన. భరింపరాని దుర్వాసన. ఆ వాసనకు తెర పట్టుకున్న వాళ్ళకు డోకొచ్చినట్టయింది. మొండోడికి కడుపులో దేవినట్లనిపించినా, తాగిన మైకంతో తమాయించుకున్నాడు. ఎట్టకేలకు, శవం గర్భం నుంచీ మరణించిన శిశువును బయటకు తీశాడు మొండడు.

తెరతొలగించబడింది.

"సూడండి బాబు...అమ్మ కడుపులో ఆరంభమయ్యే నరజల్మ... బాగా సూడండి. రెండూ రొండుగా జేసినా సూడండి"

శిశువు రెండు కాళ్ళు పట్టుకొని ఊపుతూ చూపించాడు మొండోడు. ఆ శిశువు కళేబరం నించీ, గర్భ కుహరంలో అంటుకునివున్న ఉమ్మనీరు చుక్కలు చుక్కలుగా కారుతూ, అసహ్యంగా కనిపిస్తోంది.

ఆ మృత శిశువును ఆమె కాళ్ళదగ్గరవేసి "సామే ఆసీర గుడ్డొకట్టియ్యి" అంటూ గట్టునున్న ఒక చీరను అందిపుచ్చుకుని శవానికి కప్పేసి "తల్లీ! ఈలోకానికీ, నీకూ 'కీడూ' లేకుండా జేసినా ... యింకా. పున్నె లోకాలకు పోతల్లీ ... " అంటూ గాజు పెంకు అక్కడే వదలి, గట్టుపైకొచ్చాడు మొండోడు.

"ఇంక తలాంత మన్నెయ్యండి సామి. కడసారి యాత్ర. మనం బొయినప్పుడు మన్నేసేవాళ్ళుంటారో వుండరో ... తలాపిడికెడు వాతమన్నేసి, పూడ్చేసి పున్నెం గట్టుకోండి. రుణం తీర్చుకోండి సామే" అంటూ కేకపెట్టాడు.

అతనలా అరవగానే అందరూ గుంతను సమీపించి వాత బియ్యం చల్లి, దోసెళ్ళతో మట్టివేయసాగారు.

క్షణాల్లో శవం మట్టిలో పూడుకుపోయింది అలా మట్టి తొయ్యడం పూర్తికాగానే ఇలా మొండోడు ఆ గుంతపైన కూర్చున్నాడు.

"యేమయ్యా మొండోడా గుంతపైన కూసుంటివి?" ఒకతను ప్రశ్నించాడు.

"నేను మొండోన్ని సామి. నీనింతపనిజేసినా గదా. నాకు ఓ పంచె గుడ్డా, సారాయి నీళ్ళకన్ని డబ్బులూ యియ్యల్ల, లేకంటేలెయ్యను" మొండికేసుకున్నాడు మొండోడు.

"వారే మొండి ముండాకొడకా! అడిగేదానికైనా వొగ యిదముండాల. ఏదో యిస్తారు గానీ లెయ్యి. అందరూ గుంతకు దండం పెట్టుకోని యెలబారాల" అన్నాడు రత్నమ్మ బంధువైన యింకోవ్యక్తి.

ఆ మాటతో మొండోడు పైకి లేచాడు ... గుంతకు దండాలు పెట్టి జనం తిరిగి చూడకుండా పల్లెముఖం పట్టారు.

ఇచ్చిన దక్షిణ పుచ్చుకుని, గట్టునున్న చీరల్ని మడత బెట్టి సంకనేసుకుని నిదానంగా వాళ్లననుసరించినడుస్తున్న మొండోడి మదిలో మృగం నిద్రలేచి ఆవులించింది.

"నిండు గర్భిణీ చచ్చిపోతే, ఆమెనట్లే దానంచేస్తే తమకు కీడు తగులుకుంటుందని, ఆ పీనిగిని నాసేత కోయించి తల్లినీ, బిడ్డనీ విడదీయించి పూడ్చేసిన యీళ్ళూ మడుసులే. పొట్టకూటికోసం ఎవ్వరూ సెయ్యలేని, పీనిగిని కోసిబతికే నాలాంటోళ్ళు మడుసులే. మరి, అట్ల సెయ్యకుండా పోతే కీడు తగులుకోని సొర్గానికి పోకండా వుండి పోతుందనిపించుకున్న రత్నమ్మా మడిసే, ఇంత జేసినా ఆ కీడు ఎట్ల పోయేటట్టు? అసలుంటే ఎవరికి తగిలినట్టు? కనలేక సచ్చిన ఆడబిడ్డెకా? ఆమెను కోయించిన జనాలకా? కోసిన నాకా? ఏమో?"

తెరిపిలేని ఆలోచనలతో ఊళ్ళోకి అడుగుపెట్టాడు మొండోడు. తన కోసమే ఎదురు చూస్తున్న బైరాగిని కలుసుకొని జరిగింది వివరించాడు.

అప్పటికే సూర్యుడు తూర్పు కొండల్లో అంతర్ధానమయ్యాడు. ఎన్నటికీ అంతుపట్టని పెనుమాయలా చీకటి క్రమంగా లోకాన్ని ఆక్రమించుకోసాగింది.

అదీ ఇదీ మాట్లాడుకుంటూ ఇద్దరూ దద్దలం చేరుకున్నారు. అప్పటికే మరో యిద్దరు భిక్షగాళ్ళు దద్దలంలో పడుకోనున్నారు.

మొండోడు జోలెను దించి, వెనకవున్న కుంటలోకి వెళ్ళి స్నానం చేసివచ్చాడు. ఆ తర్వాత జానెడుపొడవున్న బంగుగుడ్డ ముక్కను చేత పట్టుకుని వెళ్ళి, కుంటలో దిగి ముఖం కడుక్కుని, ఆ గుడ్డ ముక్కను నీళ్ళలో తడిపి తీసుకువచ్చాడు బైరాగి.

ఆ పూట వాళ్ళకు అన్నం తినబుద్ధి కాలేదు.

వాతావరణం వేడిగా ఉక్కపోస్తోంది.

పిండారబోసినట్లు కాస్తున్న వెన్నెల. మిణుకుమిణుకు మంటున్న నక్షత్రాలు. ఆ వేళ, ఆకాశం లోకేశ్వరుడెత్తిన జయకేతనంలా అనిపిస్తోంది.

మొండోడికి నిద్రరావడంలేదు. ఆతని అంతరంగంలో దాగివున్న మృగం గోకుతూనే వుంది. బైరాగివైపు చూశాడు. బైరాగి ఈ లోకంతో పనిలేనట్లు ప్రవర్తించే మహాఋషిలా అనిపించాడు. బైరాగి ఒక్కసారి తలగీరుకున్నాడు. ఒక చేత్తో తన బవిరి గడ్డం తీడుకొని ఆ తర్వాత జోలెలో చేయి పెట్టి బంగాకు పొట్లంతీసి, ఆకును అరచేతిలో వేసుకున్నాడు. తడుపుకొచ్చిన బంగు గుడ్డ పీలిక నుంచీ ఒక నీటి చుక్కను పిండి. ఆకును తడిపాడు. ఆ తర్వాత మరో అరచేతితో విలాసంగా తట్టాడు. తన కుడిచేతి బొటనవ్రేలితో క్షణం సేపు ఆకును నలిపి వాసన చూసి, ఆ ఆకును బంగు బుర్రలో దట్టించి బంగు గుడ్డను బుర్ర కిందచుట్టి నోట్లోపెట్టుకొని పీలుస్తూ బంగు వెలిగించుకుని ఒక్క దమ్ములాగాడు. నిషానసాలానికంటింది.

"అబ్బ" అంటూ "మొండాయనా నువ్వూరా!" అన్నాడు.

మొండోడు లేచి వెళ్ళి ఆతని ప్రక్కనే కూర్చున్నాడు. అతని చేతుల్లోని బుర్రనుతన చేతుల్లోకి తీసుకున్నాడు. బుర్రను నోట్లో పెట్టుకొని ఒక్కపీకుపీకాడు. ఆ పైన నోట్లో పొగను ముక్కులగుండావదిలాడు. ఆమరుక్షణం స్వర్గంలో తేలిపోయినట్టనిపించింది.

"నా భ్రమగానీ, ఇంతకంటే సొర్గం యింకెక్కడుంటుంది. స్వర్గం నరకం, పాపం పుణ్యాం అన్నీ మనిషి బుర్రలోనే వుండాయి" అనుకున్నాడు. అయినా ఆతనిలోని మృగం సంతృప్తి పడలేదు. మత్తెక్కి ఉన్మాదం పట్టిన దానిలా ఊగిపోసాగింది.

మళ్ళీ ఏదో ఆర్తి! ఆవేదన!

"బైరాగన్నా! ఈమడిసెందుకు పుడతావుండాడు? ఎందుకు సస్తావుండాడు? ఈ సావు పుట్టకల మద్దెన ఈ సంసారం, బందుగులు, అయినోళ్ళు, పోయినోళ్ళు, పిల్లా జల్లా, ఆస్తులు పాస్తులు ఇదంగా ఏమిటి? ఏ ఆరాటమైనా పోరాటమైనా మడిసి బతికున్నంతదాంకానే గదా! బొంది వదిలేసి జీవుడు యెళ్ళిపోయినాంకా యింకేముండాది?" నిరాసక్తంగా బంగుబుర్రను బైరాగికందిస్తూ అడిగాడు.

"అవునయ్యా! మనిషి జీవితం బుద్బుధ ప్రాయమైంది. అంటే క్షణికమైంది. ఆ నిజం తెలుసుకోలేక మనుషులు ఇన్ని పడుబాట్లు పడుతున్నారు" అన్నాడు బైరాగి గంజాయి దమ్ములాగుతూ.

"బుద్బుద ప్రాయమంటే?" ఆసక్తిగా అడిగాడు మొండోడు.

"నీటి మీద క్షణకాలం పాటుండి చిట్లిపోయేబుడగ లాంటిదనీ"

"అదెట్లా?"

బైరాగి ఒక్క క్షణం ఆలోచించి 'ఇప్పుడు నువ్వే వుండావు. పుట్టిపెరిగిన జీవితం నీకు ఎంతసేపు గుర్తుకు వస్తుంది?" అంటూ అడిగాడు.

"వొగ ఛణకాలం" సమాధానం చెప్పాడు మొండోడు.

"నీ భార్యాబిడ్డలు?"

"రెండు ఛణాలు"

"ఇప్పుడు నీవయసెంత?"

"సుమారుగా యాభై పైనుండచ్చు"

"ఈ యాభై ఏళ్లనీ జీవితం గురించి ఎంత సేపు యోచ్చన చేస్తావు?" ఆ ప్రశ్న మొండోన్ని ఇంకా తీవ్రంగా ఆలోచింపచేసింది. ఎన్నడూ అతని జీవితం గురించి ఆలోచించలేదు. అదే చెప్పాడు.

"సరే ఈ మాదిరిగానే నువ్వు ఇంకా ముసిలోడవుతావు. అప్పుడు గడిచిన నీ జీవితమంతా ఒక్క క్షణం గుర్తుకొస్తుంది. అదేమాదిరిగా కొన్నాళ్ళకు నువ్వు చచ్చిపోతావు. చచ్చిపోయింతర్వాత నిన్నెరిగిన వాళ్ళకు నీ జీవితమంతా ఒక్క క్షణమంటే ఒక్క క్షణమే గుర్తుకొస్తుంది. కొంత కాలానికి నిన్నెరిగినోళ్ళు ఎళ్లిపోయి నువ్వొక్కడున్నావన్న విషయం కూడా ప్రపంచానికి తెలీకుండా పోతుంది. అనంతమైన ఈ కాల ప్రవాహంలో నీ ఉనికే ఉండదు"

"నువ్వు చెప్తావుంటే అర్థమైనట్టే వుంటుంది మళ్ళా నిరామయంగా తోస్తుంది. ఏందో యిదంతా?" మళ్ళీ ప్రశ్నించాడు మొండోడు.

మొండోడిలో జిజ్ఞాసనీ, ఆర్తినీ బైరాగి బాగా గమనించాడు.

"అయ్యా! ముందు నిన్ను నువ్వు తెలుసుకో. అప్పుడు నీకు సమాధానం దొరుకుతుంది" అన్నాడు.

"నన్ను నేను తెలుసుకోడమా? అదెట్టా?" బంగుతాగడం పూర్తి చేసి అయోమయంగా అడిగాడు మొండోడు.

ఇతనికి ఎలా చెప్పడమా అని ఆలోచిస్తూ బంగుగుడ్డను తీసి, బుర్రను బోర్లించి, వేలితో తట్టాడు. బూడిద కిందపడగానే బుర్రను గుడ్డతో చుట్టి జోలెలో పెట్టి "నేనొగ సూక్ష్మం చెప్తాను చూడు. నీతల గుడ్డ నాచేతికియ్యి" అని అతని తల గుడ్డను చేతికి తీసుకున్నాడు బైరాగి. దాన్ని ఒక్కసారిగా ఆతనికి చూపించి "ఇదెవరిది?" అన్నాడు.

"నాది" అన్నాడు మొండోడు.

"అంటే నీ నుంచీ పై గుడ్డ వేరుపడింది. అంతేగదా"

"అవును." ఆతని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

"ఇవెవరివి?" అన్నాడు బైరాగి.

"నావి" అన్నాడు మొండోడు.

"అంటే ఈ చేతుల్లో నువ్వు లేవనే గదా అర్థం"

"ఆఁ"

అలాగే కాళ్ళు, పొట్ట, చివరికి ఆతని తలనుకూడా చూపించి అలాగే అడిగాడు బైరాగి.

"అన్నీ నావే" అన్నాడు మొండోడు.

"అంటే, నీ అవయవాల్లోను నువ్వులేవు అనే గదా అర్థం" బవిరి గడ్డం నిమురుకుంటూ చెప్పాడు.

"అవును"

"మొత్తంగా ఈ శరీరమే నీది కాదు అంతేగదా"

"ఆహాఁ. అయితే యింకనేను ఎక్కడున్నట్లు? అసలు 'నేను' ఎవర్ని?"

"అది తెలుసుకునేదానికే యుగయుగాల తరబడి మనిషి అన్వేషణ సాగిస్తా వుండాడు. రుషులు తపస్సు చేసిందీ అందుకోసమే. దాన్ని తెలుసుకోవడమే బ్రహ్మజ్ఞానం. నువ్వు-నేను, వాడు-వీడు, అదీ-ఇదీ, అన్నీ ఒక్కటే" వివరంగా చెప్పాడు బైరాగి.

అయినా అతనికి సంతృప్తి కలగలేదు. అనుకున్నదానికి సమాధానమే దొరకలేదు. అందుకే మనసులోని మృగం ఇంకా తైతక్కలాడుతూనే వుంది. పడుకున్నాడుగానీ నిద్ర రావడంలేదు.

గంజాయిమత్తులో శరీరం హాయిగా గాలిలో తేలిపోతున్నట్లనిపిస్తోంది.

బైరాగికి మాత్రం ఆవేళ చాలా ఉత్సాహంగా అనిపిస్తోంది. ఏదో ఆవేశంతో ఉన్నట్లున్నాడు.

ఏకునాదం చేతబట్టాడు. ఆ పైన పాటెత్తుకున్నాడు.

"ఎగిరిపోతాంది సిలకా ... హంస ఎగిరిపోతాంది సిలకా.

మమకారం వొదిలేసీ, బంధాలు తెంచేసి ఎగిరిపోతాంది సిలకా.

ఊరొదలి కాడొదలి ఎళ్ళి పోతాంది సిలకా

ఏడేడు పదునాల్గులోకాలు దాటి ఎళ్ళిపోతాంది సిలకా

హంస సీకట్లో కలిసిపోతాంది సిలకా - కలిసిపోతాంది సిలకా .."

తెరలు తెరలుగా దూకుతోంది పాట.

ఆ పాట ఎన్నోయుగయుగాల, జన్మజన్మల రహస్యాల్ని విప్పిచెబుతున్నట్లే వుంది. కానీ తనలో మృగానికి అర్థమైచస్తేగదా!

ఆపాట వింటూ ఆలోచిస్తూనే మొండోడు ఎప్పుడు నిద్రపోయాడో పోయాడు.

ఆ నిద్రలో ఓ కల ...

ఆకలలో ... మొండోడు చనిపోయాడు.

ఆతని శరీరం నుంచీ వేరుపడి హంసలా పైకెగిరి దద్దలంపైన కూర్చున్నాడు, తన కళేబరాన్ని తాను స్పష్టంగా చూడగలిగాడు.

ఆ యిద్దరు భిక్షగాళ్ళు, మొండోడినే చూస్తున్నారు. ఆతనికి మాత్రం ఏడుపు రావడం లేదు. సుఖం, దుఃఖం, కష్టాలు, కన్నీళ్ళు ఏవీ తెలీడం లేదు. ఎన్నో ఏళ్ళు బందిఖానాలో వుండి, ఒక్కసారిగా విడుదలైనట్లు ఒక అనిర్వచనీయమైన ఆనందం. అతనిలోని ముల్లు ఎప్పుడో

జారిపోయింది. మనసులోని మృగమూ మాయమై పోయింది. మాయ పొరలు తొలగిపోయాయి. ఎన్నో జన్మ జన్మాంతరాల అనుభవాలేవో ఏకమైన అనుభూతి.

బైరాగి ఏడుస్తూనే వున్నాడు. భిక్షగాళ్ళు విలపిస్తూనే వున్నారు. అయినా బైరాగి పాట మాత్రం ఆపడం లేదు. "ఎగిరిపోతోంది. సిలకా-హంస ఎగిరిపోతోంది సిలకా." అంటూ ఏడుస్తూనే గానం చేస్తున్నాడు.

అతనికి ఆ పాటలో హంస తానే అనిపించింది.

కడసారిగా బైరాగిని చూశాడు. భిక్షగాళ్ళనూ చూశాడు. అందమైన ప్రకృతిని చూశాడు. కళ్ళారా చూశాడు. తనివి తీరాచూశాడు. ఆ తర్వాత ఆకాశాన్ని చూసి పైకెగిరాడు. రెక్కలు చాచుకొని మరీ ఎగిరాడు. ఎక్కడికో వెళ్ళిపోతున్నాడు. దేశాలు దాటాడు. సముద్రాలు దాటాడు. దిగంతాలు దాటాడు. భువనభోంతరాలు దాటి పోతూనే వున్నాడు. గ్రహాలు, నక్షత్రాలు అన్నీ అధిగమించాడు.

ఎన్నో చీకటి లోకాలు దాటాడు! అలా ఎన్ని రోజులు ప్రయాణం చేశాడో అతనికే తేలీదు. అనంతమైన ఆ ప్రయాణంలో ఓ చోట ఓ పెద్ద ప్రవాహం ... తెల్లని కాంతి లాంటిదేదో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఓ వింత శబ్దం ... ఓంకారంలా వినిపిస్తోంది. తాను దాటి వచ్చిన గ్రహాల నుంచీ, చుక్కల నుంచీ మిణుకుమిణుకుమంటూ అసంఖ్యాకమైన మిణుగురుపురుగుల్లా, వెలుగుల గుంపులు అవిరామంగా వస్తూనే వున్నాయి. వచ్చినవి వచ్చినట్లే ఆ ప్రవాహంలో కలిసిపోతున్నాయి. వంకలన్నీ వాగులై, వాగులన్నీ కలసి నదులయినట్లు, ఆ నదులన్నీ కలసి అగాధ జలధిలో కలసిపోయి అంతర్ధానమైపోతున్నట్లు, ఆ వెలుగులన్నీ కలసిపోయి సెలయేళ్ళలా ఏకమై ఆ ప్రవాహంలో విలీనమైపోతూ, దాని ఉధృతిని పెంచుతున్నాయి.

"ఏ అడ్డంకీలేకుండా, ఎవరికోసమూ ఆగకుండా, సృష్ట్యాది నుంచీ అవిరామంగా పయనిస్తున్న కాలం అదే, ఆ కాలమే పరమాత్మ స్వరూపం."

అదృశ్య రూపంలో వున్న ఏదో కంఠం తెలియజేస్తోంది. ఎక్కడో అడవుల్లో ఏకాంతంగా ప్రవహించే వంకల్లో వర్షాకాలంలో ఎక్కడి నుంచో ఉన్నట్టుండి వచ్చికప్పేసే మిన్నేరులా దానితో బాటు ప్రయాణిస్తున్న తనని హఠాత్తుగా పొంగి కప్పేసి దానిలోకి లాగేసినట్టు, తాను ఊపిరాడక అందులోకి కరిగిపోతున్నట్లు ఏదో అనుభూతి. ఆ అనుభూతిలో ఉక్కిరి బిక్కిరైపోయి, అల్లాడిపోతున్నట్లు ... గొంతు పెగల్చుకొని అరుస్తున్నాడు తను.

"య్యోవ్! య్యావ్" అంటూ ఎవరో లేపారు.

మొండోడు కండ్లు తెరిచాడు.

ఎదురుగా ఆయిద్దరు భిక్షగాళ్ళు.

"ఏమయ్యా?" అన్నాడు మొండోడు.

"రేత్రంతా వొగిటే కలవరిస్తావుండావు. ఏమీ?" అన్నారు వాళ్ళు.

"ఓహో! అట్లానా?" అని "శవాన్ని కోసొచ్చి పొనుకునిందానికిట్లా కల కనిపించిందేమో" అనుకుంటూ చుట్టూ చూశాడు మొండోడు. అప్పటికే పొద్దు బారెడెక్కివుంది. ఈ వేళ్టికి బైరాగి స్నానం చేసి, భిక్షాటనకు బయలుదేరేవాడు. తననూ వదిలేవాడు కాదు. అలాంటి బైరాగి మరి కనిపించలేదు.

"బైరాగి ఏమైనాడు?" ప్రశ్నించాడు.

"తెలీదయ్యా. రేత్తిరెప్పుడోలేసి వెళ్ళిపోయినట్టుంది." అన్నారువాళ్ళు. గబగబా బైటకొచ్చి చూశాడు మొండోడు.

ఎక్కడా ఆతని జాడేలేదు. అలాగే మధ్యాహ్నంవరకూ చూశాడు. ఇక లాభం లేదనుకున్నాడు.

పైకి లేచాడు. జోలెను భుజానవేసుకున్నాడు. రోడ్డు పైకొచ్చాడు. ఆరోడ్డును చూస్తుంటే దాని అంతు ఏదో తెలిసినట్టే అనిపించింది. తన దారి ఏదో అర్థమైనట్లే అనిపించింది.

"మన బొందికీ, జీవుడికీ సంబంధమే లేదని చెప్పినోడు. ఈ ప్రపంచంలో ఏదీనీదికాదన్నోడు. కడాకు ఈ బొందే నీది కాదన్న నిజం నాకు తెలియజేసిన మహన్నుభావుడు బైరాగి. అట్టాంటి బైరాగి ఉన్నిట్టుండి ఎట్లామాయమై పోయినాడు. కనిపిస్తే ఇంకా శ్యానా విషయాలు అడిగితెలుసుకోవాలనుంది. ఎక్కడెక్కడని వెతికేది? ఇన్ని దినాలు వొగ బందుగుడుగా, ఒక నేస్తుడిగా నన్నాదరించి అభిమానించిన బైరాగిని ఇంక ఎన్ని దినాలకు కండ్లజూస్తు. ఆ కమ్మటి తత్త్వం ఇంక ఎన్ని జన్మలకు వినుకుందు" అనుకుంటూ నడక ప్రారంభించాడు.

నిర్మలంగా, గంభీరంగా అంగలు వేసుకుంటూ నడవసాగాడు.

ఆ తర్వాత మొండోడి జీవితంలో బైరాగి ఎప్పుడూ తారసపడలేదు.

**● ఈ కథ 16-31, జూలై 2000, కళాదీపిక - పక్షపత్రిక ప్రథమ వార్షికోత్సవ సంచికలో 'కీడు' పేరుతోను ● 'తాత్త్విక కథలు' సంపుటంలో 'మిన్నేరు' పేరుతోను ముద్రింప పడింది ●**